

# అద్వైతం

## – శారద (బ్రిస్బేన్)

(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

### 2017- ఆగస్టు

"మీ ఇల్లు చాలా బాగుంది," ఇల్లంతా పరీక్షగా చూస్తూ అంది భాను. ప్రొఫెసర్ రామదాసు భార్య గర్వంగా నవ్వింది.

"వాళ్ళబ్బాయిలిద్దరూ అమెరికాలో వుద్యోగాలు చేస్తూ డబ్బు పంపుతున్నారాయె. ఇల్లు బాగుండకేం చేస్తుంది," ఆవిడ లోపలికెళ్ళగానే, అక్కసుగా అంది టైపిస్టు శైలజ. ప్రతీ యేడూ ఎండాకాలం ముగిసి అకెడెమిక్ సంవత్సరం మొదలు కాగానే ఫాకల్టీలో ఎవరో ఒకరి ఇంట్లో చిన్న పార్టీ చేయడం ఆనవాయితీ. భాను అప్పుడప్పుడూ అశోక్‌తో కలిసి పార్టీకొచ్చినా, అందరి పేర్లూ యెప్పుడూ మరిచిపోతుంది. ఈ సారి అందరితో వీలైనంత స్నేహంగా మాట్లాడాలనీ, వీలైతే పై యేడు తమ ఇంట్లో పార్టీ ఇవ్వాలనీ నిర్ణయించుకుంది భాను.

గత ఆరు నెలలనించీ అశోక్ యేదో అన్య మనస్కంగా అనిపిస్తున్నాడు. యేదీ ఆసక్తి లేనట్టు, డల్‌గా, మూడీగా వుంటున్నాడు. అసలు ఇవాళ్టి పార్టీకి కూడా యేమొద్దన్నాడు, కానీ తనే అందరినీ బలవంతం చేసి బయల్దేరదీసింది. పిల్లలిద్దరూ సణుక్కుంటూ, గొణుక్కుంటూనే బయల్దేరారు.

పార్టీకి వొచ్చినా అందరు ఆడవాళ్ళతోటి యేం మాట్లాడాలో తనకే తోచడం లేదు భానుకి. వాళ్ళందరూ లిటరేచర్‌లో పని చేసే సాహిత్య కారులు. తను ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్ తప్ప ఇంకే భాషలూ పట్టించుకోని మనిషి. నిట్టూర్చి, బయట హాల్లో కూర్చున్న మగవాళ్ళ వైపు చూసింది. అశోక్ కనబడలేదు.

"ఆ ట్రే ఇటివ్వండి, అందరికీ జూస్ నేను సర్వ్ చేస్తాను. మీరు ఇంకో పని చూసుకోవచ్చు," చొరవగా ఎవరి చేతిలోంచో ట్రే అందుకొని హాల్లోకి నడిచింది భాను.

"మీరు లక్ష చెప్పండి శేఖర్. డీమానిటైజేషన్ వల్ల ఎంతో కొంత మేలు జరిగిన మాట మాత్రం నిజం,"ప్రొఫెసర్ రామదాసుగారు నిర్ద్వందంగా అంటున్నారు.

"దాదాపు పది నెలలైంది అయిదు వందల రూపాయల నోట్లు రద్దై. రాత్రికి రాత్రి దేశ ఆర్థిక పరిస్థితికి సంబంధించి బోల్డ్ మూవ్, అని ఒప్పుకోక తప్పదు. లేకపోతే కరప్షన్, బ్లాక్ మనీ, అడ్డూ అదుపు లేకుండా పెరిగి పోతూ, అడిగే నాథుడే లేక పాయె!"

"అవును రామదాసు గారూ! ఒప్పుకుంటాను, ఇట్ వాజ్ ఎ బోల్డ్ మూవ్. కానీ నిజంగా ఫలితం దక్కిందంటారా? సామాన్య ప్రజానీకం క్యూలల్లో నిలబడి అల్లల్లాడి పోవడం తప్ప! చిన్న చిన్న వ్యాపారాలు, దుకాణాలూ ఎంత దెబ్బ తిన్నాయి? అంతెందుకు, మనం ఎంత ఇబ్బంది పడ్డాం గుర్తు తెచ్చుకోండి. ఇది జరగబోతుందని తెలిసిన బడా బాబులందరూ వాళ్ల దగ్గరున్న నోట్లని మార్చుకున్న తరవాతే, డీమానిటైజేషన్ అమలులోకొచ్చింది," ఆవేశంగా అన్నాడు శేఖర్.

"థాంక్ యూ మిసెస్ అశోక్," ట్రేలొంచి గ్లాసు అందుకొని మళ్ళీ అటు తిరిగాడు ప్రొఫెసర్ మూర్తి.

"శేఖర్! యే మార్పూ అంత స్మూత్‌గా ఏ ఒడి దుడుకులూ లేకుండా రావు మరి. ఎంతో కొంత కొలేటరల్ డామేజీ తప్పదు." ఆ వాదనలోకి ఇంకొందరు దూరారు. కొన్ని స్వానుభవాలైతే, ఇంకొన్ని వాట్స్ఆప్‌లో వస్తున్న వార్తలు చదివి ఏర్పరుచుకున్న అభిప్రాయాలు. మధ్య తరగతి జట్టు. అక్కడ అన్నీ వున్నాయి, సమాచారమూ, అభిప్రాయాలూ, అభిప్రాయ భేదాల వల్ల వచ్చే టెన్షనూ, అన్నీ వున్నాయి–సమపాళ్ళలో, ఒక్క భవిష్యత్తు మీద భరోసా తప్ప.

అందరికీ చిరునవ్వుతో జ్యూస్ అందించి అశోక్ కోసం వెతికింది భాను. హాల్లో ఒక మూలగా నిలబడి ఇండియా టుడే చదువుతున్నాడు అశోక్.

"ఒక్కడివే నిలబడ్డావేం అశోక్? డీమానిటైజేషన్ గురించీ, జీయెస్టీ గురించీ, భూముల ధరల గురించీ అంతంత పెద్ద చర్చలు జరుగుతుంటే?" అతని పక్కకొచ్చి అన్నది.

పుస్తకంలోంచి తల పైకెత్తి ఆమె వైపు చూసి,క్షణ కాలం ఆగి అన్నాడు, "యేముంది అనడానికి? అన్ని రకాల అభిప్రాయాలూ ఎవరో ఒకరు చెప్పేసే వుంటారు. ఇప్పుడు మళ్ళీ కొత్తగా చెప్పేదేముంది!" అనాసక్తంగా అన్నాడు మళ్ళీ పుస్తకం లోకి చూస్తూ.

"ఇదేదొ కొత్తగా వుంది! ఇంత ముఖ్యమైన విషయాల మీద నీకు కచ్చితమైన ఒపీనియన్ లేకపోవడమా?" నవ్వింది భాను. అతనూ నవ్వాడు కానీ, ఆ నవ్వెందుకో అతని కళ్ళవరకూ చేరలేదనిపించింది ఆమెకి.

"పార్టీకొచ్చి కూడా మీరిద్దరే మాట్లాడుకుంటూ కూర్చుంటే, ఇక పార్టీకి రావడమెందుకు?"

వాళ్ళ పక్కకొచ్చి కూర్చుంటూ అన్నది మీనాక్షి, అశోక్ డిపార్ట్‌మెంటులోనే అసిస్టెంటు ప్రొఫెసరు.

"అవునండీ, అశోక్‌తో మాట్లాడాలంటే ఇలా బయటికొస్తేనే వీలు పడుతుంది. ఇంట్లో అసలు మాకు టైమే ఇవ్వడు!" దబాయింపుగా అంది భాను.

"మరి ఆయన వెయ్యి గుళ్ళ పూజారి. ఒక వైపు డిపార్ట్‌మెంటులో రీసెర్చీ, టీచింగు, ఆ పైన రచయిత, ఇంకా నాట్యం! ఎన్నెన్నో వ్యాపకాలు, మరి తీరిక యెలా దొరుకుతుంది?" మీనాక్షి అన్నది. ముగ్గురూ నవ్వుకున్నారు.

"యేమిటీ ఆ జోకు? మాకు చెప్పకుండా మీరే నవ్వుకుంటున్నరు?" శైలజ వొచ్చి కూర్చుంది వాళ్ళ పక్కనే.

"యేం లేదు శైలజా, అశోక్ గురించి భాను గారు కంప్లైంటు చేస్తుంటేనూ..."

ఆమె మాటలు మధ్యలోనే ఆపేసింది శైలజ.

"అన్నట్టు అశోక్ గారూ, మీ అబ్బాయి గ్రాడ్యుయేషన్ కొరకు యే కాలేజీలో చేర్పించారు? యేదో మీడియా స్టడీస్ అట కదా? మా బాబు చెప్పాడు మొన్న. ఇంజినీరింగ్ కాదన్నమాట."

అశోక్ వెన్ను వున్నట్టుండి నిటారుగా అయింది.

"అవునండీ, మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ మొదలు పెట్టాడు."

అప్పటివరకూ గల గలా మాటలు ప్రవహిస్తున్న హాలు ఎందుకో నిశ్శబ్దంగా అయిపోయింది.

"మాస్ కమ్యూనికేషనా? ఇంటెరెస్టింగ్ చాయిస్! కాకపోతే కొంచెం రిస్కు," కొంచెం దూరం నించి శేఖర్ అన్నాడు.

"రిస్కు లేని ఫీల్డు మాత్రం యేముంది శేఖర్? మనసు పెట్టి చదువుకొనీ, శ్రద్ధగా వుద్యోగం చేసుకుంటే, యే రంగంలోనైనా పైకెదగొచ్చు!" ప్రొఫెసర్ రామదాసుగారన్నారు.

"మనసు పెట్టి చేయడానికి ముందు వుద్యోగం దొరకాలిగా!" శైలజ అన్నది.

"వుద్యోగం దొరకకపోతే సినిమా రంగంలోకెళ్ళొచ్చేమో, కదా?" ఈసారి మీనాక్షి అన్నది.

"వాడికిష్టమైన ఫీల్డని అది తీసుకున్నాడు. డిగ్రీ పూర్తయినతరవాత ఏం చేయాలో వాడికే ఒక అవగాహన వొస్తుంది. మందిని ముంచైనా సరే డబ్బు సంపాదించాలన్న ఆశ లేనంతవరకూ, యే రంగమైనా మంచిదే!" అశోక్ అందరి మాటలకీ ఒకేసారి ఫుల్–స్టాప్ పెట్టేలా అన్నాడు.

"అంతే లెండి. వాళ్ళేదంటే దానికి సరేననక మనం చేయగలిగేది మాత్రం యేముంది?" నిట్టూర్చింది శైలజ. సంభాషణ మళ్ళీ వేరే విషయాల పైకి మళ్ళింది. పిల్లలెక్కడున్నారో అని చుట్టూ చూసింది భాను.

అనఘ ఒక్కత్తే బాల్కనీలో నిలబడి ఫోన్‌లో గట్టిగా నవ్వుతూ మాట్లాడుతూ వుంది. పక్క గదిలో పిల్లలేవో పాటలు పాడుతున్నట్టున్నారు, గిటార్ చప్పుళ్ళూ నవ్వులూ వినిపిస్తున్నాయి. కొడుకు గొంతు కూడా నవ్వుల మధ్యలో వినిపించడంతో ఆమె మనసు కుదుట పడింది.

పక్కనించి మూర్తి గారిగొంతు వినిపించింది.

"పిల్లలదేముందండీ, ఈజీగా అడ్జస్ట్ అవుతారు. ఆ మాటకొస్తే, దేశమే మారుతున్న పరిస్థితులకి అడ్జస్ట్ కాలేదా?మనుషులుగా మనం పరిస్థితులని అర్థం చేసుకోకా తప్పదు, వాటితో సర్దుకుపోకా తప్పదు!"

"అంతే లెండి. మీరన్న మాట నిజం!" శేఖర్ అతనితో ఏకీభవించాడు.

పార్టీ ముగిసి కార్లో ఇంటికెళ్ళేదారిలో నలుగురూ ఏమీ మాట్లాడుకోలేదు.

"భార్గవ్, అనఘా? పార్టీ బాగా ఎంజాయ్ చేసారా? ఎవరైనా కొత్త ఫ్రెండ్స్ అయ్యారా?"

"బోరింగ్!" అంది అనఘ ఫోన్‌లోంచి తలెత్తకుండానే.

"అంత బోరేం కాదమ్మా! ఇద్దరు ముగ్గురు పాత ఫ్రెండ్స్ కనిపించారు. ఇంకో ఇద్దరు కొత్త ఫ్రెండ్స్ అయారు. నాట్ టూ బేడ్!" అన్నాడు భార్గవ్.

ఇంటి కెళ్ళి బట్టలు మార్చుకుని పడుకోబోతూ అంది భాను,

"మన పిల్లలు బుద్ధిమంతులు అశోక్. పార్టీలో అసలు ఇద్దరు ముగ్గురికంటే ఎక్కువ పిల్లలే రాలేదు. మన పిల్లలు మాత్రం మనం ఎక్కడికి రమ్మన్నా వెంట వొస్తారు!"

"హ్మ్.." అశోక్ నించి అంతకు మించి రెస్పాన్స్ లేదు. ఏదోవెలితిగా అనిపించింది భానుకి.

ఎందుకిలా అవుతున్నాడు అశోక్? ఎప్పుడూ లేనిది మౌనంగా, మూడీగా. తనతోనే కదు, పిల్లలతో కూడా ఎప్పటిలా సరదాగా మాట్లాడడాం లేదు. ఏమై వుంటుంది? ఆమెకి ఎందుకో ఒంటరిగా అనిపించింది. ఇంట్లో ఎవరికి ఏ సమస్య వొచ్చినా మాట్లాడుకోవడానికీ, చెప్పుకోవడానికీ తనుంది. తనకెవరున్నారు? వున్న ఒక్క అమ్మా తననొదిలి వెళ్ళిపోయింది. చిన్నప్పుడు తనకీ అందరిలా అక్కలో చెల్లెళ్ళో వుంటే బాగుండనిపించేది. ఆ తరవాత అలవాటై పోయింది కానీ, మళ్ళీ ఈ మధ్య అలాగే అనిపిస్తుంది. చిన్నప్పుడు అప్పుడప్పుడూ బంధువుల ఇంటికీ, మేనమామ ఇంటికీ బాగానే వెళ్ళేది. తన యీడు వాళ్ళందరూ అమెరికాకో, ఆస్ట్రేలియాకో వెళ్ళిపోవడంతో కనీసం మాట్లాడుకోవడానికి మనిషి మిగల్లేదేమో.

★★★★★★★★★★★★★★★★★★★★★

## 2018-జనవరి

అశోక్ కళ్ళు పుస్తకం పైనున్నాయి కానీ, చదువుతున్న విషయంపెద్దగా మనసుకెక్కటం లేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. స్టడీ రూంలో చిన్న లైటు వేసుకొని ప్రింట్ అవుట్ తీసుకున్న కథ చదువుతున్నాడు. "మ్యూజ్ ఇండియా" పత్రికలో తెలుగులోంచి ఆంగ్లంలోకి అనువాదం చేసిన కథ. అక్కడక్కడా పెన్నుతో అండర్‌లైను చేసాడు. అనువాదం సరిగ్గానే వున్నా,యేదో వెలితి. తెలుగు సామెతలనూ, పలుకుబడులనూ ఆంగ్లంలోకి యథా తథంగా అనువదించడం వల్ల వొచ్చే అసంతృప్తి. భాష బాగానే వుంది, అక్కడక్కడా చమక్కుమనిపించింది కూడా. కానీ మూల కథలో వున్న ఆర్ధ్రతని వొడిసిపట్టుకోవడంలో విఫలమైంది.

తలుపుదగ్గర చప్పుడవడంతో తలెత్తి చూసాడు.

"నాన్నా, బిజీగా వున్నావా?" భార్గవ తండ్రి జవాబు కోసం ఎదురు చూడకుండానే లాప్‌టాప్‌తో లోపలికొచ్చాడు. అతని కళ్ళు లాప్‌టాప్ స్క్రీన్ పైనే వున్నాయి. వాడి రాకతో నిర్జీవమైన గదిలోకి ఏదో శక్తి వచ్చినట్టనిపించింది అశోక్‌కి.

తాను కనుక్కున్న అద్భుత విషయమేదో పక్క మనిషితో పంచుకోకపోతే తల బద్దలవుతుందేమోనన్న పంతొమ్మిదేళ్ళ ఉత్సాహంతో, "నాన్నా, ఇది చూడు," అంటూ తండ్రి ముందు టేబిల్ పైన లాప్‌టాప్ పెట్టాడు. చేతిలో వున్న కాగితాలు పక్కన పెట్టి కళ్ళ జోడు సవరించుకుంటూ తెర వైపు చూసాడు అశోక్.

షాట్ కొంచెం విభిన్నంగానే వుంది. ఎన్నో రంగులు, ఏ రంగూ ప్రత్యేకంగా నిలబడలేదు, కెమెరా నిదానంగా ఒక్కో రంగునూ పలకరించుకుంటూ, ప్రేమగా తడుముతూ ప్రయాణిస్తోంది. ఎన్నోరంగులున్న కళకళా వుంది, ఏమీ లేని ప్రశాంతతా వుంది. యేదో వెతుకుతున్నట్టు, యేదీ అక్కరలేనట్టు. వెనకాల వుండీ లేనట్టు మాటలూ, ఆ పైన యేదో వేణువులాటి వాద్యమూ వినపడ్డాయి. నిజంగానే అద్భుతంగా,గాఢంగా వుంది ఆ షాటు.

షాటు అయిపోయినా, ఆ నిశ్శబ్దం ఇంకా మనసుని హత్తుకున్నట్టే వుంది.

"యెవరో ఇండిపెండెంట్ ఫిల్మ్ మేకర్! కిందటి వారం యూ ట్యూబులోకి అప్‌లోడ్ చేసాడు. యెంత బాగా తీసాడు కదా?"

"హ్మ్.. నిజమే, బాగుంది."

మళ్ళీ వీడియో మీద క్లిక్ చేసాడు భార్గవ్.

"అసలు కెమెరా యెంత నిదానంగా, డెలిబరేట్‌గా కదులుతుందో చూడు. కథ చెప్పాలనుకున్నప్పుడు ఆ మాత్రం ఓపికా, ఆడియన్స్ పైన నమ్మకమూ వుండాలి!"

అశోక్ సాలోచనగా అన్నాడు, "అవును. ఎక్స్‌ప్రెషన్‌లో ఓపిక వుండాలి."

"నాన్నా! దిస్ ఈజ్ వాట్ ఐ వాంట్ టుడూ! ఇలా దృశ్యాలతో కథలు చెప్పాలి. నువ్వు రాస్తావు కదా, పత్రికల్లో కథలూ, వ్యాసాలూ? ఇదీ అటువంటి ఎక్స్‌ప్రెషనే నాన్నా!" వాడి గొంతులోని నిజాయితీకీ, గాఢతకీ ముచ్చటేసింది అశోక్‌కి.

"ఈ వీడియో నీకెలా దొరికింది? లాప్‌టాప్‌లో ఎలా చూపించావు?" కుతూహలంగా అడిగాడు.

"యూ ట్యూబ్!"

"యూ ట్యూబ్‌లో సినిమాలు చూడడమే కాకుండా ఇలా కూడా పెట్టొచ్చా?"

"అయ్యో నాన్నా! షార్ట్ ఫిలింస్ గురించి వినలేదా? చిన్న కెమెరా, కొంచెం సహకరించే స్నేహితులూ వుంటే చాలు, చిన్న షార్ట్ ఫిలిం తీసి అప్‌లోడ్ చేయొచ్చు. ఎన్నెన్ని విషయాలు వున్నాయో మనం నేర్చుకోవాలంటే!"

"నీకు తీయాలనుందా అలాటి షార్ట్ ఫిలిం?"

"తీస్తానేమో, ప్రస్తుతానికైతే కాదు. ఫిలిం రైటింగ్ అనే కోర్సు వుంటుంది. వీలైతే దాన్లో చేరతాను. అప్పుడు ఆలోచిస్తా!"

లాప్‌టాప్ మూసి లేచి నిలబడ్డాడు భార్గవ్. తండ్రి చేతిలో వున్న పేపర్లు చూసి అడిగాడు,

"ఏం చదువుతున్నావు నాన్నా?"

"ఇదా? ఇదొక కథ. తెలుగులోంచి ఇంగ్లీషులోకి చేసిన అనువాదం."

"నువ్వే చేసావా?"

"నేను కాదు. ఇంకెవరో."

" ఏం పత్రిక?"

"మ్యూజ్ ఇండియా, మంచి పత్రిక. ఆన్‌లైన్ పత్రిక."

"ఆన్‌లైన్ పత్రికైతే, మళ్ళీ ప్రింట్‌అవుట్ యెందుకు? నీ లాప్‌టాప్‌లో చదువుకోవచ్చుగా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవుననుకో, కానీ నాకు ప్రింట్‌లో చదివితేనే బుర్రకెక్కుతుంది."

"రిడిక్యులస్, నాన్నా! ఇంతకీ కథ బాగుందా?"

"ఫరవాలేదు. చదవొచ్చు."

"అయితే నీకు నచ్చలేదన్నమాట."

"నచ్చలేదని కాదు. మూల కథలో యేదో ఆవేదనా, సంఘర్షణా వున్నాయి. అనువాద కథలో అందమైన భాష ప్రయోగించాలన్న తాపత్రయమే కనపడింది. ఆ తాపత్రయమే కానీ, నిజానికి అనువాదంలో వాడిన భాష చాలా మామూలుగా వుంది. ఆంగ్ల భాషలో వున్న సహజ సౌందర్యమూ లేదు, మూల కథలో వున్న జీవిత చిత్రణా లేదు."

"అయితేనేం, ఇప్పుడు కథ ఎక్కువమందికి చేరుతుంది."

"అదే నాకు అర్థం కావడం లేదు. సాహిత్యమైనా, సంగీతమైనా, నాట్యమైనా, సరళంగా పలచబడి యెక్కువ మందికి చేరడం మంచిదా, లేక సహజంగా తనకుండే గంభీర సౌందర్యాన్ని నిలుపుకుంటూ తక్కువ మందికి అందుబాటులో వుండడం మంచిదా?"

"నన్నడిగితే తేలికగా వుండి యెక్కువ మందికి చేరడమే మంచిదంటాను."

"అందుకే సినిమా సంగీతమూ, నాట్యమూ అంత ఘోరంగా వుంటున్నాయి. వెబ్ పత్రికలలో సాహిత్యమూ, ఫేస్ బుక్‌లో రాతలూ, వాట్స్‌ఆప్ లోకథలూ, ఇక ఎవరైనా రచయితలైపోవచ్చు.రచన చేయటానికి అధ్యయనమూ, గొప్ప రచయితల సాహిత్యం చదవడమూ, సొంతంగా ఆలోచించి, ఆ ఆలోచనలని సక్రమంగా వాక్యాల్లో పొందుపరచడమూ,

వ్యాకరణమూ, సౌందర్య దృష్టీ,యేదీ అక్కరలేదు. ఒక కీబోర్డూ, బోలెడంత తీరికా, అంతులేని ఆత్మ విశ్వాసమూ వుంటే చాలు!"

"నువ్వెంత ఎలిటిస్టు మాటలు మాట్లాడతావు నాన్నా! ఇంటర్‌నెట్ లో రాతల్నిమరీ అంత తీసిపడేయాల్సిన పని లేదేమో! ఆలోచించు. నాకు నిద్రొస్తుంది వెళ్ళి పడుకుంటాను," భార్గవ్ వెళ్ళిపోయాడు.

★★★★★★★★★★★★★

## 2019- డిసెంబర్

సాయంత్రం చీకట్లూ, చలీ హైదరాబాదు నగరాన్ని మెల్లిగా గుప్పిట్లోకి తీసుకుంటున్నాయి. హాల్లో టీవీలో వార్తలు వింటున్నారందరూ. ఏదో తెలియని భయం అందరిలో మెల్లిగా పాకుతోంది.

టీవీలో వస్తున్న వార్తలకంటే, మనసుల్లో కదులుతున్న భయమే ఎక్కువగా తెలుస్తోంది.

ఆఫీసునుంచి వొచ్చిన భాను బట్టలు కూడా మార్చుకోలేదు. ఇంకా వొంట మొదలు పెట్టనూ లేదు. అసలు ఓపిక లేక కూర్చుంది.

ఇంగ్లీషు,తెలుగు వార్తలు మార్చి మార్చి చూస్తున్నారు. అన్ని భాషల్లోనూ,అన్ని చానల్లలోనూ అవే పడికట్టు మాటలు – వైరస్, వూహాన్, కోవిడ్, కరోనా వైరస్, లంగ్ ఇంఫెక్షన్, చైనా. ఒక చానెల్లో యేమీ గాభరా పడొద్దని చెప్తే, ఇంకో చానెల్లో కొంప మునిగిందని చెప్తున్నారు. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మొద్దో, ఏది నిజమో, ఏది పుకారో తెలియని అయోమయం.

డైనింగ్ టేబుల్ ఒక్కటే ఎప్పటిలా, యే మార్పూ లేకుండా వుంది. అందరి బేగులూ, లాప్‌టాపులూ, సెల్‌ఫోన్లూ, లంచి బాక్సులూ,అస్తవ్యస్తంగా పడి వున్నాయి, వాళ్ళ ఆలోచనల్లాగే.

"మా అఫీసులో ఇంటర్నేషనల్ ట్రావెల్ ఆపేస్తున్నారు. సింగపూర్ టీం ట్రిప్పు కేన్సిలయింది. ప్రొడక్షన్ దెబ్బతింటుందని మేనేజిమెంటు జుట్టు పీక్కుంటుంది! నేను వచ్చే యేడు వెళ్ళాల్సిన అమెరికా ట్రిప్పు కేన్సిలయిపోతుంది." భాను టీవీలో అడ్వర్టయిజుమెంట్లు మొదలవ్వగానే వాల్యూము తగ్గించి అన్నది.

భార్గవ్ తలెత్తి చూసాడు. "అవును, ట్విట్టర్లో చదివానివాళ. కొందరేమో గబ్బిలాల నుంచి వొస్తుందంటున్నారు. కానీ పాకేజీలూ ముట్టుకున్నా అంటుకుంటుందట!"

"ట్విట్టర్ ఏమీ పెద్ద మెడికల్ జర్నల్ కాదు. అక్కడి వార్తలు చదివి కంగారు పడొద్దు," అశోక్ అన్నాడు. కానీ ఆ రోజే మధ్యాహ్నం తాను కూడా గూగుల్లో రకరకాల సమాచారం చదివి, ముఖ్యమైన సమాచారాన్ని నోట్ చేసి పెట్టుకున్నాడు.

అనఘ కళ్ళ పైన పడుతున్న జుట్టు పైకనుకుంటూ చెప్పింది,

"మా స్కూలు వాట్సాప్ గ్రూపులో రేపట్నించి మాస్కులు పెట్టుకోమంటారని అంటున్నారు."

"డిసెంబరు నెలలో మాస్కులేంటి! వాట్సాప్‌లో నానా చెత్తా వొస్తూనే వుంటుంది." భాను తేలిగ్గా అనడానికి ప్రయత్నించినా, గొంతులో ఏదో కంపనం.

పక్క గదిలోంచిపద్మ నాభం దగ్గు వినిపించేసరికి అందరూ ఉలిక్కి పడ్డారు.

"పెద్ద వాళ్ళకి ఇంఫెక్షన్ సోకితే ప్రాణాలు దక్కట్లేవట!" భార్గవ్ మెల్లిగా అన్నాడు.

"భానూ, ఇవాళనేను అమ్మాకి ఫోన్ చేసాను. రేపు అమ్మని తీసుకొచ్చేస్తాను."

సరే నన్నట్టు తలూపింది భాను. అప్పుడే ఆమె మనసు కేలిక్యులేషన్ మోడ్‌లోకి వెళ్ళిపోయింది. ఇద్దరు పెద్దవాళ్ళతో సంబాళించుకోవడమెలా? మందుల ఖర్చులూ, హాస్పిటల్ బిల్లులూ!

"అయినా, ప్రమాదమంతా చైనాలోనే వుందట. ఇంతకుముందెన్ని వైరస్‌లు రాలేదు. ఇదీ వాటిలాగే. 2009లో సార్స్, స్వైన్ ఫ్లూ తట్టుకోలేదా? ఇదీ అంతే!" అశోక్ అన్నాడు.

"కానీ ఇక్కడామొదలైతే కాలేజీలూ, అఫీసులూ మూసేయాల్సొస్తుందేమో!"

"అకడెమిక్ ఇయర్ వేస్టయిపోతుంది!"

"ప్రపంచంలో అందరం చచ్చిపోతున్నా, అమ్మకి అకడెమిక్ ఇయర్ గురించే బాధ!" అనఘ దెప్పింది. భాను తలరుద్దుకుంటూ లేచి నిలబడింది.

"నా భయమంతా నాన్నా, అత్తయ్యల గురించే. ఇద్దరూ పెద్దవాళ్ళు. చూద్దాం, యెలా జరగాలనుంటె అదే జరుగుతుంది!" లేచి వంటింట్లోకి నడిచింది.

టీవీలో న్యూస్ రీడరు చెప్తున్నాడు, "ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు".

యెందుకో ఆ మాటతో ఆందోళన బాగా పెరిగింది అందరిలో. బయట నగరం భయం గుప్పెట్లోకీ, మృత్యువు నీడలోకీ, నిశ్శబ్దంగా జారుతోంది.

★★★★★★★★★★★

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS